మాచర్ల మున్సిపాలిటీలో బూత్ క్యాప్చరింగ్‌కు కుట్ర

- వైయస్ఆర్‌సీపీ ఏజెంట్ల ఫారాలు అడ్డుకుంటూ టీడీపీ గూండాల దౌర్జన్యం



పల్నాడు జిల్లా, మాచర్ల: మాచర్ల మున్సిపాలిటీలో ఎన్నికల ప్రక్రియను అడ్డుకుని బూత్ క్యాప్చరింగ్, భారీ రిగ్గింగ్‌కు పాల్పడేందుకు కుట్ర జరుగుతోందని వైయస్ఆర్‌సీపీ నేతలు ఆరోపించారు. వైయస్ఆర్‌సీపీ అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్ల ఫారాలు సమర్పించకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఫారాలు స్వీకరించేందుకు అవకాశం లేదంటూ అభ్యర్థులకు ఫోన్లు చేస్తున్నారని తెలిపారు. ఏజెంట్ల ఫారాలను బలవంతంగా లాక్కుని చించివేయడం ద్వారా ఎన్నికల ప్రక్రియను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు టీడీపీ శ్రేణులు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. ఏజెంట్ల ఫారాలను అడ్డుకుంటున్న వారిని ప్రశ్నించిన వైయస్ఆర్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావుపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఈ వ్యవహారంలో మాచర్ల మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుకుమార్ కూడా సహకరిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ శ్రేణులు, ఎన్నికల అధికారులు కుమ్మక్కై ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించకుండా ఎన్నికల సంఘం తక్షణమే జోక్యం చేసుకోవాలని, ఏజెంట్ల ఫారాల స్వీకరణకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

నగరడోణలో మహిళలపై పోలీసుల వేధింపులు

- పోలీసుల తీరుపై ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి ఆగ్రహం

కర్నూలు జిల్లా, ఆలూరు: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చిప్పగిరి మండలం నగరడోణ గ్రామంలో వైయస్ఆర్‌సీపీకి ఓటేస్తారనే ఉద్దేశంతో మహిళలను పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి మండిపడ్డారు. గ్రామానికి చెందిన మహిళలపై ఎస్ఐ నరసింహులు బైండోవర్ కేసులు పెట్టేందుకు ప్రయత్నించడమే కాకుండా, గంజాయి కేసులు నమోదు చేస్తామని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించినట్లు తెలిపారు. మహిళలను అరెస్టు చేసి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, టీడీపీ నేతలకు అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను బైండోవర్ చేసేందుకు తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లడంతో వారు పోలీసులను, తహసీల్దార్‌ను నిలదీశారు. తమపై బైండోవర్ కేసులు ఎలా పెడతారంటూ ప్రశ్నిస్తూ పోలీసుల వైఖరికి నిరసనగా ఆదోని-గుంతకల్లు రహదారిపై ధర్నాకు దిగారు. మహిళలను బెదిరించి ఎన్నికల్లో భయానక వాతావరణం సృష్టించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని విరుపాక్షి డిమాండ్ చేశారు. మహిళలపై వేధింపులకు పాల్పడుతున్న పోలీసులపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



పులివెందులలో అరాచకాలకు వెన్నుపోటు పార్టీ భారీ స్కెచ్

- సీఎంఓ, డీజీపీ కార్యాలయం నుంచి పోలీసులకు ఆదేశాలు
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఫైర్

పులివెందుల: పులివెందుల మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా జరగనీయకుండా వెన్నుపోటు పార్టీ భారీ కుట్రకు తెరతీసిందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మండిపడ్డారు. సీఎంఓ, డీజీపీ కార్యాలయం నుంచి వస్తున్న ఆదేశాలతో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, దీనికి కోయ ప్రవీణ్ కనుసన్నల్లో టీడీపీకి అనుకూలంగా ఎన్నికల ప్రక్రియను నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. బయటి ప్రాంతాల నుంచి కార్యకర్తలను తరలించి, దొంగ ఓట్లు వేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో పూర్తి వెబ్‌కాస్టింగ్, లైవ్ ఫుటేజ్ ఏర్పాటు చేయాలని హైకోర్టును ఆశ్రయించినట్లు పులివెందులలో మీడియాతో వెల్లడించారు.

అడ్డదారిలోనైనా గెలవాలనే కుట్ర

ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే బీటెక్ రవి, ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులను అడ్డుకుంటున్నారని అవినాష్‌రెడ్డి తెలిపారు. రెండో రోజు నామినేషన్లకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని, 37 రౌండ్ల కాల్పులు, పొగ బాంబులు, బాష్పవాయువు, లాఠీచార్జితో అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారని పేర్కొన్నారు. మహిళా అభ్యర్థులను సైతం నామినేషన్లు వేయనీయలేదన్నారు. గతంలో 33 వార్డులు ఏకగ్రీవమయ్యాయని బీటెక్ రవి చేస్తున్న ప్రచారం అవాస్తవమని, అప్పట్లో టీడీపీ పోటీకే దూరంగా ఉందని స్పష్టం చేశారు.



దాడులకు ఆధారాలున్నా చర్యలు శూన్యం

ఎన్నికల ప్రచారంలో వైయస్ఆర్‌సీపీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని, సునీతకు చెందిన షాపు, హరిబాబుకు చెందిన రెండు బైకులు తగులబెట్టారని తెలిపారు. 33వ వార్డులో అభ్యర్థి నిరంజన్‌రెడ్డి ట్రక్కు, ఎస్టీ అభ్యర్థి అంజినప్ప బైకును దహనం చేశారని, ఆయన ఇంటిపైనా పెట్రోల్ పోశారని చెప్పారు. గుడ్డునగిరిగుట్టలో సీనియర్ కార్యకర్త నాగరాజు ఎక్స్‌యూవీ వాహనాన్ని కూడా తగులబెట్టారని పేర్కొన్నారు. వీడియో ఆధారాలు ఇచ్చినా నిందితులపై చర్యలు తీసుకోకుండా, తమ కార్యకర్తలపై 307 సెక్షన్ కేసులు పెట్టి అరెస్టులు, రిమాండ్‌తో వేధిస్తున్నారని మండిపడ్డారు.

బయటి ప్రాంతాల నుంచి జనాన్ని తరలించి దొంగ ఓట్లకు స్కెచ్

గత ఏడాది పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో బయటి ప్రాంతాల నుంచి వేలాదిమందిని తీసుకొచ్చి స్థానిక ఓటర్లను, పోలింగ్ ఏజెంట్లను అడ్డుకున్నారని అవినాష్‌రెడ్డి గుర్తుచేశారు. ఇప్పుడు జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు, రాయచోటి ప్రాంతాల నుంచి జనాన్ని తరలించి లాడ్జిలు, ఫంక్షన్ హాళ్లలో ఉంచుతున్నారని తెలిపారు. పోలింగ్ రోజున దొంగ ఓట్లు వేయించడం, నిజమైన ఓటర్లను అడ్డుకోవడం వంటి ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ అక్రమాలపై ఎస్ఈసీకి ఫిర్యాదు చేయడంతో పాటు, ప్రతి పోలింగ్ కేంద్రంలో పూర్తి వెబ్‌కాస్టింగ్, లైవ్ ఫుటేజ్ ఏర్పాటు చేయాలని హైకోర్టులో పిటిషన్ వేశామని వెల్లడించారు.

పులివెందుల అభివృద్ధిని చూసి ఓటేయండి

వైఎస్సార్, వైయస్ జగన్ కృషితోనే పులివెందులకు కృష్ణాజలాలు వచ్చి రైతులకు సాగునీరు అందిందని అవినాష్‌రెడ్డి తెలిపారు. జగన్ ప్రభుత్వం రూ.500 కోట్లతో నిర్మించిన మెడికల్ కాలేజీకి మంజూరైన 50 ఎంబీబీఎస్ సీట్లను కూటమి ప్రభుత్వం వద్దని కోరిందని పేర్కొన్నారు. సుమారు 8 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి, కాలనీల్లో రోడ్లు, విద్యుత్, తాగునీరు, బోర్‌వెల్స్ వంటి సదుపాయాలు కల్పించామని, ప్రస్తుతం అక్కడ అభివృద్ధి పనులు నిలిచిపోయాయని తెలిపారు. రైతుల కోసం రూ.25 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కోల్డ్ స్టోరేజ్‌ను కూడా వినియోగంలోకి తీసుకురాలేదన్నారు. పులివెందుల మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అభ్యర్థి ప్రమీలమ్మతో పాటు, వైయస్ఆర్‌సీపీ పోటీ చేస్తున్న 20 వార్డుల అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మాచర్లలో ఖాకీల అండతో పచ్చ గూండాల దాడులు

- అరాచకాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులా?
- పిన్నెళ్లి రామకృష్ణారెడ్డి ధ్వజం

పల్నాడు జిల్లా: మాచర్లలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, బీ ఫారాలు చించివేయడం, బీరువా గుర్తుతో ప్రచారం చేస్తున్న వారిపై దాడులకు పాల్పడటంపై వైయస్ఆర్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెళ్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల అండతో కూటమి నేతలు దాడులకు పాల్పడుతున్నారని, బాధితులపైనే అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. తనపై 19 కేసులు నమోదు చేసి బెయిల్ రద్దు చేస్తామంటూ బెదిరిస్తున్నా పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. మాచర్ల క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు.

మాచర్లలో పోలీసుల అండతో దాడులు.. బాధితులపైనే కేసులు

మాచర్లలో ఓటమి భయంతోనే టీడీపీ నామినేషన్ల నుంచి ప్రచారం వరకు అడ్డంకులు సృష్టిస్తోంది. బీ ఫారాలు చించివేసినా మా అభ్యర్థులు బీరువా గుర్తుతో ప్రజల్లోకి వెళ్లి మద్దతు కోరుతున్నారు. మైనారిటీ మహిళ సుల్తానాను చైర్‌పర్సన్ అభ్యర్థిగా నిలబెట్టడంతో ఏజెంట్ ఫారాల సమర్పణ సమయంలో రౌడీ, గంజాయి బ్యాచ్‌లతో దాడులు చేయించారు. ఎన్నికల అధికారి, కమిషనర్, పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. కారంపూడి, దుర్గి, వెల్దుర్తి, నాగార్జునసాగర్ ప్రాంతాల్లోనూ పోటీ చేయవద్దంటూ పోలీసులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ ఘటనలపై జిల్లా ఎస్పీకి, ఎస్ఈసీకి



ఆధారాలతో ఫిర్యాదు చేశాం. బాధ్యులెవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

మాచర్ల అభివృద్ధి మా హయాంలోనే.. కూటమి హామీలేవీ?

వైయస్ జగన్ ప్రభుత్వ హయాంలో మాచర్లలో రింగ్ రోడ్డు నిర్మాణం, ఆసుపత్రి విస్తరణ, 5,400 మంది పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టాం. కూటమి ప్రభుత్వం కొత్తగా ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని, రాష్ట్రంలో 6.40 లక్షల పెన్షన్లు తొలగించిందని పేర్కొన్నారు. మాచర్ల నియోజకవర్గంలో 6,400 మందికిపైగా తల్లులకు అమ్మఒడి నిలిపివేశారని తెలిపారు. మహిళలకు రూ.1,500, నిరుద్యోగులకు రూ.3 వేల భృతి, 20 లక్షల ఉద్యోగాలు వంటి హామీలు అమలు కాలేదన్నారు. వైయస్ జగన్ హయాంలో అమ్మఒడి, చేయూత, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలతో పేదలకు అండగా నిలిచామని గుర్తుచేశారు.

19 కేసులు పెట్టినా భయపడం.. 36 మంది అభ్యర్థులకు అండగా ఉంటాం

నామినేషన్ వేసినప్పటి నుంచి తనను హౌస్ అరెస్ట్ చేశారని, గతంలో ఉన్న 18 కేసులకు మరో కేసు జోడించి 19 చేశారని పిన్నెళ్లి తెలిపారు. బుద్ధిపాలెం జంట హత్యల కేసులో 98 రోజులు జైలులో ఉంచారని, ఇప్పుడు బెయిల్ రద్దు చేస్తామంటూ బెదిరిస్తున్నారని చెప్పారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, వైయస్ఆర్‌సీపీకి చెందిన 36 మంది అభ్యర్థులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అభ్యర్థులపై దాడులు, బెదిరింపుల ఘటనలపై ప్రత్యేక దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు స్వేచ్ఛగా ఎన్నికల్లో పాల్గొనే అవకాశం కల్పించాలని పిలుపునిచ్చారు.

ఎన్ని కుట్రలు చేసినా మా విజయాన్ని ఆపలేరు: సుల్తానా, వైయస్ఆర్‌సీపీ బలపరిచిన మాచర్ల మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అభ్యర్థి

తనను అభ్యర్థిగా బలపరిచిన వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి, పిన్నెళ్లి రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డికి సుల్తానా కృతజ్ఞతలు తెలిపారు. మైనారిటీ మహిళగా తనకు, ఇతర అభ్యర్థులకు ఎన్నో అడ్డంకులు సృష్టించారని చెప్పారు. ఫ్యాన్ గుర్తు లేకపోయినా బీరువా గుర్తుతో ఇంటింటికీ వెళ్లి ప్రజల మద్దతు పొందామని, రేషన్ కార్డులు, వాలంటీర్ ఉద్యోగాల తొలగింపు, తాగునీరు, రోడ్లు, కాలువల సమస్యలను ప్రజలు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. జగనన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారని, ఎన్ని కుట్రలు చేసినా ప్రజల అభిమానంతో తమ విజయాన్ని ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు.